క్లుప్తంగా

స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

ఉరవకొండ: స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న శ్రీగాంధీ హరిజన హాస్టల్ స్థలంపై ఆర్డీఓ రవీంద్ర బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారించారు. గాంధీ హరిజన హాస్టల్ స్థలం రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో ప్రభుత్వ కార్యాలయంగా నమోదైనట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపి వెబ్ ల్యాండ్‌లో గాంధీ హరిజన హాస్టల్‌గానే పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలువైన స్థలాన్ని ఎవ్వరి పేరు మీద మార్చే అవకాశం ఉండదన్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అనంతపురంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం ఎంపీపీ నారాయణ రెడ్డి కలిశారు. కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే మరుట్ల, అరవకూరు, కరుట్లపల్లి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. అదే విధంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవసరమయ్యే నిధులపై చర్చించారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి




బెళుగుప్ప జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ హనుమప్ప

బెళుగుప్ప: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ డీఈ హనుమప్ప పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బెళుగుప్ప, విరుపాపల్లి, శ్రీరంగాపురం గ్రామాల్లో హౌసింగ్ మండల ఏఈ శివారెడ్డి, పీఆర్ జేఈ సుధాకర్‌తో కలసి జగనన్న లేఔట్‌లు, గ్రామాల్లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండలంలో మొత్తం 1,865 మందికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికే 808 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా.. మరో 486 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు చేపడితే ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లిస్తామన్నారు. ఇళ్లు మంజూరైనా.. నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు హౌసింగ్, సచివాలయ అధికారులు వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. పనులు ప్రారంభించేలా చూడాలని పేర్కొన్నారు.

కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ రద్దు

కూడేరు: ఐసీడీఎస్ ప్రాజెక్టుల విభజనలో భాగంగా కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టును రద్దు చేసినట్లు సీడీపీఓ ధనలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కింద కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం మండలాలు ఉండేవన్నారు. కూడేరు ప్రాజెక్టును అనంతపురం రూరల్ ప్రాజెక్ట్‌గా మార్పు చేసినట్లు పేర్కొన్నారు. కూడేరు మండలాన్ని ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోకి కలపడం జరిగిందన్నారు. ప్రాజెక్టుల పరిపాలనా సౌలభ్యం కోసం ఒక నియోజకవర్గంలోని మండలాలన్నీ ఒకే ప్రాజెక్టులో ఉండేలా చేసినట్లు తెలిపారు.

నూనె గింజల పంటలు సాగు చేయాలి



వేరుశనగను పరిశీలిస్తున్న నీతి అయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారిణి బి.అనురాధ

కళ్యాణదుర్గం రూరల్: రైతులు నూనె గింజల పంటలను సాగు చేయాలని నీతి అయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారిణి బి.అనురాధ అన్నారు. బుధవారం మండలంలోని మానిరేవులో నూనె గింజల సాగుపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేరుశనగతో పాటు నూనె గింజలు, చిరుధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఆహారంలో సమతుల్యత కోసం వీటిని సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సమీపంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, ఏఓ జగదీష్, ఆర్‌బీకే అధికారి అఫ్జల్, సచివాలయ సిబ్బంది రంగనాథ్, మహిళా పోలీస్ జయమ్మ పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక రైతు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం రూరల్(గుమ్మఘట్ట): దేశానికి వెన్నముక రైతు అని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని టీ.వీరాపురం గ్రామంలో మైక్రోవాటర్‌షెడ్ అధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీతో అందించిన వ్యవసాయ పనిముట్లను చిన్న, సన్నకారు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీ.వీరాపురం, గ్రామదట్ల గ్రామాల్లోని 260 మంది రైతులకు 650 వ్యవసాయ పరికరాలను అందించామన్నారు. రూ.84.69 లక్షలు విలువ చేసే స్ప్రేయర్లు, టార్పాలిన్లు, స్ప్రింక్లర్లు, ఆయిల్ ఇంజన్లు, 7 మడకలు, పీవీసీ పైపులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీలకు 90 శాతం, బీసీలకు 80 శాతం సబ్సిడీతో పరికరాలను అందిస్తున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబును నమ్మొద్దు..

నిరుద్యోగులు, ప్రజలు, అన్ని వర్గాల వారిని మోసగించిన చంద్రబాబును నమ్మరాదని సూచించారు. వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ అందించారన్నారు. రైతులకు కరెంటు బిల్లుల నుంచి విముక్తి కల్పించిన మహనీయుడని కొనియాడారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కరెంటు బిల్లులు తగ్గించాలని బషీరాబాగ్‌కు వెళ్లిన రైతులను కాల్చి చంపిన దుర్మార్గుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఇలాంటి దుశ్చర్యలను చూసి చలించిపోయిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కరెంటు బిల్లులు మాఫీ చేసి 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిచారని కొనియాడారు. చంద్రబాబు, కరువు కవలపిల్లలని ఎద్దేవా చేశారు. చంద్రబాబును నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుళమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు హొన్నేమల్లికార్జున, ఎంపీటీసీ సభ్యురాలు రాజమ్మ, మైక్రోవాటర్ షెడ్ చైర్మన్ రఘు, వాటర్‌షెడ్ ఏపీఓ శ్రీవిద్య, మహేష్, బొమ్మయ్య, చిత్రయ్య, మల్లికార్జున, గొర్ల రామాంజిని, కాదలూరు అంజి,హర్ష, జీ.హేమారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

రాయదుర్గంటౌన్: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, సీఎం వైఎస్ జగన్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలే అందుకు నిదర్శమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఏపీ చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలోని టెక్స్‌టైల్స్ పార్కులో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో బ్యాచ్ కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అలాగే మూడో బ్యాచ్ కుట్టు శిక్షణను విప్ ప్రారంభించారు. రెండో బ్యాచ్‌లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అంతకుముందు జరిగిన సమావేశంలో విప్ మాట్లాడుతూ.. కుట్టు శిక్షణతో సొంతంగా ఉపాధి పొందాలన్నారు. కుట్టు శిక్షణ అనంతరం మహిళలకు అవసరమైన సహాయసహకారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏపీ చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజి మాట్లాడుతూ.. రాయదుర్గంలో ఇప్పటికే రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కార్యక్రమం పూర్తయిందన్నారు. ప్రస్తుతం మూడో బ్యాచ్‌లోనూ 30 మంది మహిళలకు శిక్షణను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ చేనేత, జౌళీ జిల్లా శాఖ డీఓ బసవరాజు, గార్మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చమ్మా ఇబ్రహీం, ప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు కాపు భారతి చేతులమీదుగా అవార్డు తీసుకుంటున్న మల్లికార్జున

కళ్యాణదుర్గం రూరల్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ వైద్యురాలు హేమలత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రిడ్స్ స్వచ్ఛంద సంస్థ, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు డాక్టర్ సూర్య నాగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీఎల్ కాంతారావు, కృష్ణవేణి, అఖిల, అంజినరెడ్డి రిడ్స్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ: అనంతపురంలోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. 590 యూనిట్ల రక్తదానం చేసినందుకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు కాపు భారతి, డీఎంహెచ్ఓ వీరబ్బాయి చేతుల మీదుగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున అవార్డు తీసుకున్నారు.

మంత్రులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే విశ్వ



మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్‌తో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: అనంతపురం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్‌తో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు మెమోలు

కూడేరు: మండల పరిధిలోని గొటుకూరు సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. సెక్రెటరీ ప్రశాంత్, వీఆర్వో సాయిరాం రెడ్డి, మహిళా పోలీసు శంషాద్, వెటర్నరీ అసిస్టెంట్ సుబహాన్, విలేజ్ హార్టికల్చర్ ఆఫీసర్ పుల్లప్ప హాజరైనట్లు సంతకాలు చేయలేదు. అలాగే ఉద్యోగులు అందులోబాటులో లేకపోవడంతో ఎంపీడీఓ మెమోలు జారీ చేశారు. సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. పనులకు సకాలంలో బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ తులసీ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుల దాడి



గాయపడిన మొహ్దీన్ సర్మస్

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొహ్దీన్ సర్మస్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మహ్మద్ రఫీ, ఇతని బావమరిది కమల్‌బాషా దాడి చేశారు. వివరాలు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొహ్దీన్ సర్మస్ ఇంటికి ఆనుకుని టీడీపీ నాయకుడు మహ్మద్ రఫీ అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టాడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త సర్మస్ నా ఇంటికి ఆనుకుని ఎందుకు గోడ కడుతున్నావు.. నీ స్థలంలో నువ్వు కట్టుకో అని టీడీపీ నాయకుడు రఫీకి సూచించాడు. నా ఇష్టం వచ్చిన చోట గోడ కడతాను. నువ్వు ఎవ్వడివీ రా అంటూ సర్మస్‌పై రఫీ ఇతడి బావమరిది కమల్‌బాషా రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో సర్మస్ తలకు బలమైన గాయం కావడంతో బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

16న హుండీ కానుకల లెక్కింపు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయ హుండీ కానుకలను ఈనెల 16న లెక్కిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి మేరీపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ శంకర్

గుమ్మఘట్ట(రాయదుర్గం రూరల్): రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి మేరీని మూడు నెలల క్రితం కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ రఘురామారావు, సర్పంచ్ ఊలెమ్మ, గ్రామస్తుల (ఫిర్యాదుదారుల) సమక్షంలో డీఎల్‌డీఓ శంకర్ విచారణ చేపట్టారు. విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, సిబ్బందితో గొడవలు పెట్టుకోవడం, సిబ్బందితో సమన్వయం లేకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం, ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించడం వంటి 14 అభియోగాలపై విచారించారు. వాంగ్మూలాలను, స్టేట్‌మెంట్లను రికార్డు చేసి కలెక్టర్‌కు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శి మేరీ ఇంత వరకూ ఇతరులకు బాధ్యతలు అప్పగించ లేదు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా.. బాధ్యతలు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అప్పగించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజమే



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు వై.భీమిరెడ్డి

వజ్రకరూరు: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు వై.భీమిరెడ్డి అన్నారు. మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భీమా సూపర్ ఛాలెంజర్‌కప్–2 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేతగా నిలిచిన గుంతకల్లు వారియర్స్‌కు ట్రోఫీతో పాటు రూ.50,116 అందజేశారు.రన్నర్స్‌గా నిలిచిన కొనకొండ్ల భీమా లెవెన్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25,116 నగదు వై.భీమిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీచైర్మెన్ రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు లాలెప్ప, నారాయణ, ఆర్గనైజర్లు రాజా, నాగరాజు, చుక్కారామాంజి, హరి, దేవేంద్ర, గోపాల్, కమిటీ సభ్యులు అంజి, గోవిందు, చెన్న, షర్మాస్, హనుమేష్, రాజేష్, ప్రదీప్, శీనా, అంజి, హరి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం



సచివాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న ప్రజలు

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని భైరవానితిప్ప సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు కపటలింగనపల్లి, పోలేపల్లి, భైరవానితిప్ప గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 11 గంటలు అయినా సచివాలయం తలుపులు తీయలేదని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఎప్పుడు వస్తారో తెలియక వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మంగళవారం కూడా 11 గంటలకు సచివాలయానికి వచ్చి సంతకాలు, బయోమెట్రిక్ వేసి వెళ్లి పోయారని తెలిపారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుడితే.. ఉద్యోగులు మాత్రం పని చేయడం లేదన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వజ్రకరూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం ఉందని సర్పంచ్ మల్లెల జగదీష్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప అన్నారు. బుధవారం చాబాల ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు రాజేష్, శ్రీధర్, దేవేంద్ర, శకుంతలమ్మను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ధనుంజయ, సచివాలయ కన్వీనర్ రామచంద్ర పాల్గొన్నారు.

'దిశా' యాప్‌తో రక్షణ

కూడేరు: ప్రభుత్వం మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, అందులో భాగంగానే దిశా చట్టాన్ని అమలు చేయడం జరిగిందని ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం కూడేరులో దిశా యాప్ డౌన్‌లోడ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎక్కడైనా ప్రేమ పేరుతో ఆకతాయిలు వేధిస్తే ఫిర్యాదు చేయొచ్చన్నారు. అనంతరం పలువురు మహిళల మొబైల్స్‌లో దిశా యాప్ డౌన్‌లోడ్ చేయించారు.

ఘనంగా ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ఉంతకల్లు రుక్మిణి పాండురంగస్వామికి ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కుందుర్పి: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని స్థానిక వైద్యాధికారులు చాంద్‌బేగం, అనూషా తదితరులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వడ్డెపాళ్యం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్స చేశారు. వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక వైద్య సిబ్బంది, సర్పంచ్ గోవిందమ్మ, ఎంపీటీసీ ఈరన్న పాల్గొన్నారు.

జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎంగా జయప్రద

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎంగా జయప్రద బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా చిలమత్తూరు నుంచి జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు విచ్చేసినట్లు ఆమె తెలిపారు. ఇక్కడ హెచ్ఎంగా పని చేస్తున్న రమాదేవి గుమ్మఘట్ట మండలం పులకుంటలోని జెడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు.

జగన్ వెంటే మేమంతా..



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజల వెల్లడి
- ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు బాగున్నాయి. మాకు పారదర్శకంగా అందాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. జగన్ వెంటే మేమంతా ఉంటామని వెల్లడించారు. బుధవారం మండల పరిధిలోని హావళిగి సచివాలయం–2 పరిధిలోని విజ్ఞేశ్వర కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ.. ఇంటింటికీ తిరుగుతూ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత తమ జీవితాలు మారాయని ప్రజలు సంతోషంతో తెలిపారు. ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా పేదలను ఆదుకుంటున్నారని చెప్పారు. మాకు అండగా నిలిచిన జగన్‌ను మరోసారి ఆశీర్వదిస్తామన్నారు. జగన్ పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా ఉంటే మా పిల్లల తలరాతలు మారుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కృషి చేస్తున్నారన్నారు. ప్రజలందరూ సీఎంకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచ్ గీతమ్మ, ఎంపీటీసీలు రాజమ్మ, కళావతి, సర్పంచులు రామాంజనరెడ్డి, బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, నాయకులు కరణం భీంరెడ్డి, రఘురాములు, వడ్డే మడకశి, శీనా స్వామి, గోవర్దన్ రెడ్డి, హనుమంతు రెడ్డి, స్వామిదాస్, తిప్పయ్య, ఉమాశంకర్, సురేష్ యాదవ్, గడేకల్లు ప్రసాద్, హేమంత్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఈరమ్మ సురేష్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

విడపనకల్లు: హావలిగి సచివాలయం–2 పరిధిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ కరణం పుష్పావతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే విశ్వ హాజరవుతారన్నారు.

సంక్షిప్త సమాచారం

సీసీల బదిలీ

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో పని చేస్తున్న ఇద్దరు క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు ఖాజా, నారాయణ స్వామి బదిలీ అయినట్లు ఏపీఎం గుణశ్యాం బుధవారం తెలిపారు. గుంతకల్లు మండలంలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ రామానంద్ వజ్రకరూరు మండలానికి బదిలీ అయ్యారన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

గుమ్మఘట్ట: బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్లకెర, గుమ్మఘట్ట గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. బాలల హక్కుల పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుళ, కామాక్షి, చంద్రకళ, సావిత్రి, మారెక్క,నాగరత్న,రియాజ్‌బేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

బెళుగుప్ప: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వెంకటాద్రిపల్లి ఉన్నత పాఠశాల పీసీ కమిటీ చైర్‌పర్సన్ ప్రవీణ పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం బాలాజీ అధ్యక్షతన జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి సోంపల్లి అశోక్, నాయకులు శంకర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: స్థానిక జెడ్పీ హైస్కూల్, పాల్తూరులో విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కురుబ గిరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు సుంకన్న, విద్యా కమిటీ చైర్మన్ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు


శెట్టూరు: ఉపాధ్యాయులు పాఠశాలలకు నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఎంఈఓ శ్రీధర్ కోరారు. వివిధ పాఠశాలల్లో ఉదయం పూట ఉపాధ్యాయులు పాఠశాలలకు ఆలస్యంగా హాజరవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. బుధవారం మంగంపల్లి పాఠశాలను సందర్శించారు. పిల్లలను నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

కళ్యాణదుర్గం: సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని మండల ప్రత్యేక అధికారిణి, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మండల పరిధిలోని గరుడాపురం సచివాలయం, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, ప్రజలకు సర్వీసులను మరింత వేగంగా అందించాలన్నారు. అనంతరం కొత్తూరులో నాడు–నేడు పథకం కింద నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన పనులను పరిశీలించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ దాసా నాయక్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. కూలీలకు వెంటనే మస్టర్ పేమెంట్లు చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ నందకిశోర్, ఈసీ జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు లావణ్య, అవినాష్, పండరీష్, మంజునాథ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న దృశ్యం

శెట్టూరు: మండల పరిధిలోని కైరేవు గ్రామంలో మాజీ సర్పంచ్ ఇటుక నాలప్ప జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన జట్టు విజేతగా.. కై రేవు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. క్రీడాకారులకు సింగిల్ విండో డైరెక్టర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కప్, షీల్డ్‌లు అందజేశారు. నాయకులు హనుమంతరాయుడు, బీమేష్, నరసింహ, బాదెప్ప పాల్గొన్నారు.

పొగాకు ప్రాణాంతకం

కంబదూరు: పొగాకు వాడకంతో ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తుందని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సర్పంచ్ పద్మవతమ్మ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడటం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, వైద్యాధికారి ఆసియా బేగం, రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, నాయకుడు చెన్నకేశవు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుతో లాభాలు

విడపనకల్లు: చిరుధాన్యాల సాగుతో లాభాలు ఆర్జించవచ్చని ఉరవకొండ ఏడీఏ పద్మజ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాల్తూరు ఆర్బీకేలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలతో చిరుధాన్యాల సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఈఓ మేర్సీ, ముత్యాలు, సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, నాయకుడు గంగన్న పాల్గొన్నారు.

బెళుగుప్ప: చిరుధ్యాన్యాల సాగుకు రైతులు ఆసక్తి చూపాలని ఏఓ పృథ్వీసాగర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కొర్ర, జొన్న, సజ్జ, రాగి సాగును గణనీయంగా పెంచాలన్నారు.

ఎమ్మెల్యే టికెట్.. నాదంటే నాదే

- ప్రచారం చేసుకుంటున్న ఉన్నం, ఉమా
- టికెట్ ఎవరికి ఇస్తారో తెలియక పార్టీలో అయోమయం
- ఎటూ తేల్చుకోలేని స్థితిలో నాయకులు
- కార్యక్రమాలకు దూరంగా కేడర్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం టీడీపీలో నాయకులు, కార్యకర్తల్లో అంతర్మథనం మొదలైంది. ఈసారి ఎమ్మెల్యే టికెట్ తమకంటే తమకంటూ ఉన్నం, ఉమా వర్గాలు చెప్పుకోవడంతో కార్యకర్తలు అయోమయంలో పడిపోతున్నారు. పోటాపోటీగా కార్యక్రమాలు చేయడంతో ఎటూ వెళ్లలేక కేడర్ ఇంటికే పరిమితమైంది. దీంతో ఈ సారైనా ముందుగానే టికెట్ ఎవరికి కేటాయిస్తారో ప్రకటించాక పార్టీ కార్యక్రమాలకు వద్దాంలే అంటూ కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు బాహాటంగానే చెబుతున్నారు.

వేర్వేరుగా పార్టీ సమన్వయ కమిటీ సమావేశాలు

ఇటీవల మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, టీడీపీ ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వర నాయుడు వర్గాలు వేర్వేరుగా పార్టీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించారు. అయితే ఇరు వర్గాల్లో కొందరు కార్యకర్తలు సమావేశంలోనే ఈ సారి 'మీకు టికెట్ ఇస్తారా..' లేక ఇవ్వరా అంటూ ఉన్నం, ఉమాలను కార్యకర్తలే నిలదీశారు. ఇలా ఎన్నాళ్లు మేము అటు పోలేక.. ఇటూ రాలేక చావాలంటూ.. మొహం మీద అడిగేశారు. దీంతో ఖంగుతిన్న ఇరు వర్గాల నేతలు తమ పరిస్థితి ఏంటనే సమాలోచనలో పడ్డారు.

కార్యకర్తలను తరలించేందుకు అవస్థలు..

ఇక ఇరు వర్గాలు చేపట్టే కార్యక్రమాలకు బలవంతంగా కార్యకర్తలను తరలించేందుకు ఇరువర్గాల నేతలు అవస్థలు పడుతున్నారు. కొందరినైతే బతిమాడాల్సిన పరిస్థితి ఆ పార్టీలో నెలకొంది. భోజనం, మద్యం ఇస్తూ గ్రామాలకు వాహనాలను పంపినా కార్యక్రమాలకు కార్యకర్తలు వచ్చే పరిస్థితి కనబడటం లేదు. టీడీపీ ప్రభావం ఉన్న గ్రామాల్లో సైతం ద్వితీయ స్థాయి నాయకులు మీరు టికెట్ తీసుకురండి.. కార్యక్రమాలకు వస్తామంటూ.. ఇంటి వద్దనే పనులు చేసుకుంటున్నారు. ఇలా నేతల మధ్య వర్గపోరుతో కేడర్ సైతం దూరంగా ఉండే పరిస్థితి టీడీపీలో నెలకొంది.

త్వరలో అధినేత వద్దకు ఇరువర్గాలు

కళ్యాణదుర్గంలో టికెట్‌పై మల్లుగుల్లాలు పడుతున్న ఉన్నం, ఉమా వర్గాలు త్వరలో అధినేత వద్దకు క్యూ కట్టనున్నారు. ఇప్పటికే పలుమార్లు పార్టీ పెద్దలు ఇరువురి మధ్య సయోధ్య కుదుర్చేందుకు యత్నించినా అది ఫలించలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టికెట్ ఎవరికనేది అధినేత వద్దే తేల్చుకుందాం అంటూ ఇరు వర్గాలు సిద్ధమవుతున్నాయి.